

7న కాకినాడలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ

విశాఖ, పిఠాపురం గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఈ నెల 7న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్లో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఐటిఐ, ఇంటర్ (ఒకేషనల్) ఉత్తీర్ణులైన 29 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.11 వేలనుంచి రూ.19,659 జీతం ఇస్తారని, బోనస్, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో పిఠాపురం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకి హాజరుకావాలని కోరారు.

పస్తుల్లో ఉపాధి కూలీలు

- 11 వారాలుగా అందని వేతనాలు
- అప్పులతో నెట్టికొస్తున్న కార్మికులు
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో నానాటికి వ్యవసాయ పనులు తగ్గిపోతున్నాయి. యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ కార్మికులకు పనులు సన్నగిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం వీరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. వేతనాలు తక్కువ అయినా ఈ పథకం అనేక కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తుంది. పేదల జీవనోపాధికి దోహదం చేస్తున్న ఉపాధి పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్నాయి. వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇస్తున్న అరకొర వేతనాలు నెలల తరబడి పెండింగ్లో ఉంచుతున్నారు. దీంతో ఈ పథకం పైనే ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులు పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. కొంత మంది అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలనే డిమాండ్లు గత కొన్నేళ్లుగా వ్యవసాయ కార్మికులు నుంచి వినిపిస్తున్నాయి. కానీ పాలకుల్లో ఏమాత్రం స్పందన కన్పించడం లేదు.

జిల్లాలోని 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలుండగా 2.74 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 4.48 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో రెగ్యులర్‌గా 3.15 లక్షల మంది పని చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ఈ నెల నుంచి ప్రారంభం కావడంతో ఇప్పటికే జిల్లాలో పనులు గుర్తింపు పూర్తయింది. దీంతో అధికారులు అరకొరగానే పనులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం సుమారు 9 వేల మంది మాత్రమే పని చేస్తున్నారు. గత నెల రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో పని ప్రదేశంలో సౌకర్యాల లేమితో ఒక పక్క కూలీలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

వేతనాలు అందక అవస్థలు

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులందరూ ఉపాధి వేతనాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత 11 వారాలుగా వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. జనవరి 16 నుంచి వేతనాలు తమ ఖాతాల్లో జమ కావడం లేదని కూలీలు గగ్గోలు పెడుతున్నారు. ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి పనులకు వెళుతూ అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వారానికి ఒకసారి ఖాతాల్లో సొమ్ములు వేయాల్సి ఉంది. నిధుల కొరత పేరుతో కూటమి సర్కారు ఉపాధి కూలీల జీవితాలతో ఆటలాడుతోంది. రెక్కాడితేనే కానీ డొక్కాడని దుస్థితిలో ఉన్న పేదలు పస్తులు ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. ఒక కూలీ 6 రోజులూ పనికి వెళితే రోజుకి రూ.270 నుంచి రూ.280 చొప్పున వారానికి రూ.1,680 వస్తుంది. జిల్లాలో ఒక్కొక్కరికి సుమారు రూ.17 వేలు వరకూ వేతనాలు అందాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.18.02 కోట్లపైనే బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రతిరోజు ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్నాను. 11 వారాలుగా వేతనాలు అందడం లేదు. కుటుంబాలను పోషించుకునేందుకు చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలను విడుదల చేయాలి.

- అంబటి రాజారావు, ఉపాధి కూలీ, కోరంగి, తాళ్లరేవు మండలం

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



ఉపాధి హామీ పథకం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. అందుకే పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. పొమ్మన కుండా కూలీలకు పొగ పెట్టే ప్రయత్నం జరుగుతుంది. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే బకాయి వేతనాలను విడుదల చేయాలి.

- పాట్లకాయల కృష్ణ, గొర్రెపూడి, కరప మండలం

ఆందోళనకు సిద్ధం



ప్రభుత్వం తక్షణమే ఉపాధి వేతన బకాయిలను విడుదల చేయాలి. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఎంతకాలం ఇలా అప్పులు చేయాలి. వేతనాలను విడుదల చేయకపోతే ఆందోళనకు సిద్ధపడతాం.

రెడ్డి సత్యనారాయణ, ఉపాధి కూలీ, ఎఫ్‌కె.పాలెం, పిఠాపురం మండలం



ఎపిఈపిడిసిఎల్ ఇఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

విద్యుత్ భారాలపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న విద్యుత్ ఛార్జీలకు నిరసనగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎపిఇపిడిసిఎల్ ఇఇ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నేత దువ్వా శేషబాబ్జీ మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఆ హామీని మరచిపోవడం సిగ్గుచేటన్నారు. అదానీకి లాభాలు చేకూర్చే సెకి ఒప్పందం రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు ట్రూ అప్, సర్దుబాటు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరుతో వినియోగదారులపై భారాలు వేయడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. విద్యుత్ వినియోగం అధికంగా ఉండే సమయాల్లో టైం ఆఫ్ ది డే పేరుతో ధర పెంచాలనే ప్రతిపాదన దుర్మార్గమైనదని అన్నారు. ప్రజల అత్యవసరాన్ని అవకాశంగా తీసుకుని భారాలు వేయడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి భారాలు ఆపాలని లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, డి.ప్రసాద్, నాయకులు చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, కె.సత్తిబాబు, తలుపులమ్మ, వెంకట్రావు, స్వామి, యు.సత్యనారాయణ, జై రాం, మల్లేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతికి నిరసనగా శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - తాళ్లరేవు, ఏలేశ్వరం



ఏలేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా తాళ్లరేవు, యానం పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కోరంగి పంచాయతీ గుడ్డువాడిని తూము సెంటర్ నుంచి గాంధీనగర్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ మాట్లాడారు. పగడాల ప్రవీణ్ మృతి పట్ల పలు అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి క్రైస్తవ సంఘాలకు ప్రభుత్వంపై విశ్వాసం కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్‌కు చెందిన ప్రతినిధులు, క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రవీణ్ మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని నినాదాలు చేశాఉరు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల మండల అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్, సుదర్శన్ డేవిడ్‌రాజ్, వి.వత్సలరావు, బి.సుమలత, ఎం.సుజాత, కె.రవికుమార్, ఎం.త్రిమూర్తులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నన్నయ క్యాంపస్‌లో విసి తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న నన్నయ విసి ప్రసన్నశ్రీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం క్యాంపస్ ప్రాంగణాలను, కార్యాలయాలను, వసతీ గృహాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది హాజరు, పనితీరుపై ప్రిన్సిపల్ ఆచార్య ప్రశాంతిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో అన్ని కోర్సుల సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పించాలని హితవు పలికారు. వసతి గృహాన్ని సందర్శించిన ఆమె సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహాన్ని, మెస్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం డిగ్రీ, బిఇడి, లా పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో నియమ నిబంధనలు పాటిస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యా లయం అనుబంధ కళాశాల్లలో డిగ్రీ 4, 6 సెమిస్టర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నా యన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని 109 కేంద్రాల్లో సుమారు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు. బిఇడి, బిపిఇడి, డిపిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో 2,500 మంది, లా 8, 10 సెమిస్టర్ పరీక్షలకు 3 కేంద్రాల్లో 500 మంది పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

శ్మశాన వాటికలో పనులు ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పెంకేవారిపేట స్మశాన వాటికలో అభివృద్ధి పనులకు భూమి పూజ జరిగింది. రూ. 50 లక్షల వ్యయంతో లయన్ కైలాస భూమిగా అభివృద్ధి చేయడానికి లయన్స్ క్లబ్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే గురువారం శ్మశానంలో భూమిని చదును చేసే పనులు ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని క్లబ్ ప్రతినిధులు నడింపల్లి వినోద్, బిళ్లకుర్తి శ్రీనివాస రెడ్డి, పొన్నాడ పేరయ్య రాజు, పి. నరేంద్ర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, సతీష్ రాజు, చిట్టూరి చలపతి, మల్లాడి రాంబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, కుడుపూడి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి...

ప్రజాశక్తి - గండేపల్లి



ఎస్‌పి బిందుమాధవ్‌ను సత్కరిస్తున్న ఆదిత్య శేషారెడ్డి

భావి, భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులు డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా జీవితంలో ఎంతో నష్టాన్ని చవిచూడాల్సి వస్తాదని ఎస్‌పి జి.బిందుమాధవ్ అన్నారు. గురువారం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో 'డ్రగ్స్ వద్దు బ్రో', శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. యూనివర్శిటి ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ వాడినా, రవాణా చేసిన చాలా నష్టపోతారన్నారు. అలాగూ శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. విపత్కర సంఘటనలు ఎదురైనప్పుడు కేవలం మొబైల్‌ను షేక్ చేయడం ద్వారా పోలీసులు రక్షణ కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ శక్తి ఆప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌పిని యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్ శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి సిఆర్.రాజు, ఎస్‌బిడిఎస్ పి.శ్రీరామ్ కోటేశ్వరరావు, ట్రైనింగ్ డిఎస్‌పి సిహెచ్.జీవన్, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ శివనాగబాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న సూరిబాబు రాజు

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ పోటీ తత్వంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యాభివృద్ధిలో ముందుకు సాగుతారన్నారు. ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహించేదుకు ముందుకొచ్చిన చిల్డ్రన్స్ క్లబ్బు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ అలీ, నీలపాల బాలమురళీకృష్ణ, చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, డి.కృష్ణ, డి.సత్యనారాయణ, అమృత, నమ్రత పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ఇటీవల కాలంలో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో సరియైన రక్షణ చర్యలు లేకపోవడమే చోరీలకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో జరుగుతున్న జాతరల సందర్భంగా పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. రవీంద్రపురంలోని రెండు ఆలయాల్లో చోరీలు జరిగాయి. ఉప్పాడ ప్రాంతంలో పలు దుకాణాల్లో చోటుచేసుకున్నాయి. కొత్తపట్నానికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి గృహంలో బంగారు ఆభరణాలు చోరీకి గురియైంది. వరుసగా జరుగుతున్న చోరీల పట్ల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు.

'కుడా' నిధుల విడుదలకు వినతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కుడా పరిధిలోని అన్ని పంచాయతీలకు నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ పంతం నానాజీని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ కోరారు. గురువారం గుడారి గుంటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో ఆయనను కలుసుకుని వినతి పత్రాన్ని అందించారు. గతంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన అన్ని అనుమతులు పంచాయతీలే ఇచ్చేవని, తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేదని తెలిపారు. కుడా ఏర్పాటుతో పంచాయతీలు ఆదాయాన్ని కోల్పోయాయని, కావున ఆయా పంచాయతీల నుంచి వచ్చిన ఆదాయంలో వాటాను పంచాయతీలకు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిధుల విడుదలకు కృషి చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.

నేడు పలు భవనాలకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను ఎంఎల్‌సి కె.నాగేంద్రబాబు శుక్రవారం ప్రారంభించనున్నారని మున్సిపల్ కమిషనర్ ఎం.కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం, తహశీల్దార్ కార్యాలయ భవనాలు, మంచినీటి సరఫరా హౌస్, అన్న క్యాంటీన్లను ఆయన ప్రారంభిస్తారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు పాల్గొంటారని ఆయన తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగహన

ప్రజాశక్తి - శంఖవరం

తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో డిఎల్‌పిఒ బాలామణి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు, సిబ్బందికి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఇంటి పన్ను వసూళ్లు, ప్రభుత్వం నుంచి ఐవిఆర్ కాల్స్‌పైనా వివరించారు. ఈ పర్యటనలో ఇఒపిఆర్‌డి చక్రవర్తి, కార్యదర్శి అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నార.

7 నుంచి ఆక్వా జోన్లపై గ్రామసభలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో సుస్థిర ఆక్వా సాగు కోసం ఆక్వా జోన్ల ఏర్పాటు చేయడానికి ఈనెల 7 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జి.గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 వ తేదీన చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, 8వ తేదీన పటవల, కోరంగి, 9వ తేదీన పి.మల్లవరం, పోలేకుర్రు, నీలపల్లి, సుంకరపాలెం, ఇంజరం గ్రామాలలో ఈ సభలు జరుగుతాయన్నారు. ఈ సభలలో ఆక్వా రైతులు, రైతులు పాల్గొని అనుమానాలు నివీత్తి చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెదపూడి


మండలంలో గొల్లల మామిడాడ సబ్ స్టేషన్‌లో మరామ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పైన, రాజుపాలెం, గంద్రేడు, వేంద్ర పెద్దాడ, కైకవోలు, కుమార ప్రియం, జి.మామిడాడ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని పెద్దనాపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి ధర్మరాజు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సురేష్, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, దలే కిషోర్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటాం: ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - సామర్లకోట



విలేకరులతో మట్లాడుతున్న ఛైర్‌పర్సన్ అరుణ

తనపై పెడుతున్న అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటానని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. గురువారం ఛైర్‌పర్సన్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనను నాలుగేళ్ల పాటు మీడియా వద్దగానీ, అధికారుల వద్ద ఏమీ మాట్లాడనీయకుండా నా గొంతు నొక్కేశారని అన్నారు. ప్రస్తుతం అవిశ్వాసం పేరుతో నా కుటుంబాన్ని రోడ్డుకు ఈడ్చి అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ తప్పు లేకపోయినా అవిశ్వాసం కోసం తనకు వ్యతిరేకంగా కలెక్టర్‌కు లేఖ ఇచ్చారని, పదవి నుంచి తప్పుకోమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, ఆయన తండ్రి సుబ్బారావు తనను ఆదేశిస్తే సంతోషంగా తప్పుకునే దాననని అన్నారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన కుటుంబాన్ని రోడ్డుకీడ్చడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. కౌన్సిలర్‌గా నెగ్గిన తాను ఎలాంటి పదవులను ఆశించలేదని, పార్టీ ఇన్‌ఛార్జ్ దొరబాబు సూచనల మేరకే తనను బలవంతంగా ఛైర్‌పర్సన్‌గా నిలబెట్టారన్నారు. అప్పట్లో ఛైర్ పర్సన్ పదవి కోసం డబ్బు సంచితో తిరిగిన ఒక కాంట్రాక్టర్‌పై నమ్మకం లేకే తనను ఎంపిక చేశారని, ప్రస్తుతం అదే వ్యక్తిని తెరపైకి తెచ్చి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఛైర్‌పర్సన్ అరుణ భర్త కృష్ణమూర్తి విమర్శించారు. ఛైర్‌పర్సన్ చెప్పినవి వినవద్దని వైసిపి ఇన్‌ఛార్జ్ దొరబాబు, ఆయన తండ్రి సుబ్బారావు అధికారులకు చెప్పి అవమానానికి గురిచేశారని ఆరోపించారు. పట్టణ అభివృద్ధి కోసం చేసిన అజెండాను కౌన్సిల్లో ప్రవేశపెడితే దానిపై చర్చించకుండా సమావేశాన్ని బాయ్‌కట్ చేయడం దారుణమన్నారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పట్టణ అభివృద్ధికి కృషి చేస్తుంటే తన పార్టీకి చెందిన కౌన్సిలర్లు అడ్డుకోవడం సరి కాదన్నారు. ఇన్‌ఛార్జ్ దొరబాబును కలిసేందుకు ఎన్ని దఫాలు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. అవిశ్వాసాన్ని తాను ఎదుర్కొంటానని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు కాటూరి జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీలక్ష్మి

ఆసుపత్రి నిర్వహణపై అసంతృప్తి

ప్రజాశక్తి - కరప

స్థానిక పిహెచ్‌సి నిర్వహణపై మండల పరిషత్ పాలకవర్గం అసంతృప్తిని వ్యక్తం చేసింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిహెచ్‌సి నిర్వహణ, సిబ్బంది తీరుపై జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పిహెచ్‌సిలో అందుతున్న సేవల పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, గతంలో పిహెచ్‌సిలో అందించిన సేవలతో జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఆసుపత్రి నిర్వహణపై జిల్లా అధికారులకు నివేదికను పంపించాలని ఆయన ఎంపిడిఒ ఎం.అనుపమకు సూచించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నేరాలు ఘోరాలు

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో నందిగూడెం గ్రామంలో కోళ్ల ఫారంలో పనిచేస్తున్న సతామీ కోటల్(30) ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిందని పోలీసులు తెలిపారు. నందిగూడెం గ్రామంలో కాకర్ల దివాకర్, సంజీవ్‌కుమార్ కోళ్లఫారం నడుపుతున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొంత మంది కూలీలు ఇందులో పనిచేస్తున్నారు. సతామి కోటల్(30), సునీల్ కోటల్ సహజీవనం చేస్తూ కోళ్ల ఫారంలో కొంత కాలంగా పనిచేస్తున్నారు. బుధవారం ఆమె తోటి పని వారితో కొయ్యలగూడెం వారపు సంతకు వెళ్లి వచ్చింది. సునీల్ కోటల్ తన మొదటి భార్య బ్యాంకు ఖాతకు రూ.5వేలను పంపించాడు. ఈ విషయమై ఇరువురికీ తగాదా జరిగింది. ఆగ్రహంతం సతామీకోటల్ ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుంది. చుట్టూ పక్కల వారు తలుపులు పగలగొట్టి చూసేటప్పటికి ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. కిందకి దింపి చూడగా అప్పటికే చనిపోయింది. కోళ్ల ఫారం యజమాని ద్వారా సమాచారం తెలుసుకుని నందిగూడెం విఆర్‌ఒ కొత్తపల్లి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి చోరీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గ్రామ పరిధి లంక పొలాల్లో గోదావరి నది ఏటిగట్టు సమీపాన రైతుల మోటార్లకు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌కో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లో బుధవారం అర్ధరాత్రి రాగి తీగలు చోరీకి గురైనట్లు స్థానిక రైతులు తెలిపారు. ఆ శాఖ అధికారులు ఇటీవల నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు. అయితే గురువారం ఉదయం వచ్చేసరికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి దానిలోని రాగి తీగలను చోరీ చేసినట్లు గుర్తించమన్నారు. ఈ ట్రాన్స్ఫార్మర్ సుమారు రూ.2 లక్షల విలువ ఉంటుందని స్థానిక లైన్మెన్ తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకుని, ఆ ప్రదేశంలో మరొక ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

తాడేపల్లిగూడెం నుంచి కె.గంగవరంకు ఎటుగట్టు మీదిగా ధాన్యం లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి మండల కేంద్రమైన కపిలేశ్వరపురం పుష్కరాల రేవు వద్ద ఆనుకుని ఉన్న హోటల్‌లోకి దూసుకు వెళ్లింది. హోటల్ నిర్వాహకులు మోటిపల్లి వెంకట రమణ (రవి) చెందిన హోటల్లోకి బుధవారం రాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో లారీ దూసుకు పోవడంతో షెడ్ తో పాటు వంట సామగ్రి పూర్తిగా దెబ్బతింది. రాత్రి సమయంలో హోటల్ నిర్వాహకులు ,అక్కడ ఎవ్వరు లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ బ్రేక్ పడకపోవడం వల్ల అదుపుతప్పి హెూటల్ లోకి దూసుకు వెళ్లిందని లారీ డ్రైవర్ సతీష్ తెలిపారు, దీనిపై రాజీ కుదిరినట్లు సమాచారం.

మోటార్ సైకిల్ దగ్ధం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఇంటి వద్ద పార్క్ చేసి ఉంచిన మోటార్ సైకిల్ ను దగ్ధం చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సిహెచ్.రాజేష్ కథనం మేరకు భీమనపల్లి పంచాయతీ సూధాపాలెంకు చెందిన మట్టపర్తి శ్రీకృష్ణ ప్రభాకరరావుకు చెంది మోటార్ సైకిల్ తన ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి శ్రీ కృష్ణ ప్రభాకరరావు సమీప బంధువు గంప అనిల్ కుమార్ మోటార్ సైకిల్ పై పెట్రోలు పోసి నిప్పు పెట్టి అంటించినట్టు శ్రీకృష్ణ ప్రభాకరరావు భార్య లక్ష్మీ ప్రసన్న తమకు ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నేడు బిసి రుణాల దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ ఏడాది బిసి సామాజికవర్గాలకు చెందిన రుణాల అందించేందుకు స్వీకరించిన దరఖాస్తులను శుక్రవారం పరిశీలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. స్థానిక టిటిడిసి శిక్షణా కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందన్నారు. బిసి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పక పాల్గొనాలని సూచించారు. దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫారం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణపత్రం, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్‌లకు చెందిన మూడేసి జిరాక్స్‌లను తీసుకురావాలని కోరారు.

ట్రాక్టర్లను అడ్డుకున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ సూరేడు దంప ప్రాంతంలో అసైన్డ్ భూముల్లో మట్టిని తొలగిస్తున్న ట్రాక్టర్లను లబ్ధిదారులు గురువారం అడ్డుకున్నారు. అనంతరం అసైన్డ్ లబ్ధిదారుల వారసులు పెనుమాల బాబా నరసింహారెడ్డి, కన్నీడి వెంకటరమణ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 1975లో దంప ప్రాంతంలో ఆత్రేయ పాయ ఆనుకుని సుమారు పది ఎకరాలను పెనుమాల ధర్మరాజు, కన్నీడి హంసలాల్ తదితరులకు ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వం నిర్వహించిన డ్రెడ్జింగ్ పనుల్లో భాగంగా మట్టిని మా భూముల్లో వేసిందని, దీనివల్ల ఆ భూముల్లో వ్యవసాయం చేసే అవకాశం లేకుండా నష్టపోయామని తెలిపారు. ఆ మట్టిని కొందరు అక్రమంగా తరలించకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన రైతులు

ప్రజాశక్తి - యానాం

సాగునీటి కష్టాలను పరిష్కరించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను గురువారం దరియాలతిప్ప రైతులు కలిసి కోరారు. పంట చేతికందే సమయంలో నీరు అందించకపోతే పంట పూర్తిగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఎల్ఎ అశోక్ పిడబ్ల్యూడి ఎఇ కాళ్ల నాగరాజుతో ఫోన్లో మాట్లాడి సాగునీటికి చర్యలు చేపట్టాలని సూచించారు. మరో రెండు మూడు రోజుల్లో సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తీరుకోటి భైరవమూర్తి, కోరుకొండ బాలయోగి, కోరుకొండ ఆనందరావు, సబ్బతి రాంబాబు, పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దార్ వెంకటలక్ష్మి

మున్సిపాలిటీ పరిధిలో ఎంపిక చేసిన బిసి, కాపు, ఇడబ్ల్యూఎస్ లబ్ధిదారులకు సకాలంలో రుణాలు పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల మేనేజర్‌లు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, మెప్మా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 1037 మంది బిసి, తదితర కులాల అభ్యర్థులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. బిసి కార్పొరేషన్ లక్ష్యాలకు అనుగుణంగా బిసిలకు 49, కాపు సామాజికవర్గానికి 32 మంది, ఇడబ్ల్యూఎస్‌కు చెందిన ఆరుగురికి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా సిఎంఎం భ్రమరాంబ, మెప్మా సిఒలు నర్గీస్, శ్రీదేవి, సల్మా, ఆర్‌పిలు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత అధ్యక్షన బ్యాంకు అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాయితీ రుణాల కోసం మండల పరిధిలో 2457 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండల పరిధిలో మంజూరైన 63 యూనిట్లకు 50 శాతం సబ్సిడీపై రుణాలు అందజేస్తారన్నారు. ఈ సమావేశంలో యాక్సెస్, డిసిసిబి, పంజాబ్ నేషనల్ తదితర 5 బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

రీసర్వే దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం



కాజులూరులో సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ ఠాగూర్

కాజులూరు రీ సర్వే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తాహశీల్దార్ జి.రవీంద్రనాథ్‌ఠాగూర్ ఆదేశించారు. గురువారం మండలంలోని కోలంక గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల కొలతలతో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అందుకే ప్రభుత్వం రీ సర్వేను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రి సర్వే డిటి చందన, విఆర్‌ఒలు, రీ సర్వే సహాయకులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** పటవల పంచాయితీలో ఉప సర్పంచ్ చక్కపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో తహశీల్దార్ పి.త్రినాధరావు పాల్గొన్నారు. గ్రామ సభలో సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ పటవల పంచాయతీలో గత 30 సంవత్సరాలుగా అసైన్డ్, పోరంబోకు భూములకు పట్టాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి భూములను అనుభవిస్తున్న నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని, కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భజన సత్తిబాబు, బోనం శ్రీనివాస్, దంగేటి అప్పన్న, మండల సర్వేయర్ షఫీ, రీసర్వే డి.టి. వీరబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రీ సర్వేపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడారు. నియమ నిబంధనల ప్రకారం సకాలంలో సర్వేలు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిటికాంతారావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - తాళ్లరేవు



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మాలలు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా గురువారం మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. స్థానిక అంబేద్కర్ భవనం నుంచి చెరువుగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ జరిగితే తాము తీవ్రంగా నష్టపోతామని అన్నారు. వర్గీకరణ ఆలోచనను ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సిఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోఆర్డినేటర్ రెడ్డి గిరిబాబు, ప్రతినిధులు ఈశ్వరిబాయి, లోవరాజు, తాతారావు, వెంటపల్లి నూకరాజు, జక్కల ప్రసాద్ బాబు, కాశి లక్ష్మణస్వామి, వడ్డి ఏడుకొండలు, ఎడ్ల కుటుంబరావు, విప్పర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - రౌతులపూడి



వైసిపిపి క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, వైసిపి నాయకులు యనమల కృష్ణుడు అన్నారు. గురువారం మండలంలోని రాజవరంలో వారు పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని అన్నారు. అనంతరం సర్పంచ్ తిరుమల వెంకన్నదొర స్థల సాయంతో నిర్మించిన కృష్ణుని ఆలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు, అన్నవరం దేవస్థానం మాజీ మెంబర్ వాసిరెడ్డి జామిలు, ముదునూరి మురళీకృష్ణరాజు, వైస్ ఎంపిపి సాయి, వైసిపి మండల అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ తవ్వకాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఉప్పంపాలెం, ములగపూడి నల్లరాతి క్వారీలను మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఫణిభూషణ్‌రెడ్డి, ఆర్ఐ మురళీకృష్ణ గురువారం తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్న ప్రాంతంలో ప్రోక్లైనర్, కంప్రెసర్, డిన్నర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ తవ్వకాలపై ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు చేపడతామని వెల్లడించారు.

అనాధికార తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

మండలంలో అనాధికారంగా జరుగుతున్న క్వారీ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా సహజ వనరుల దోపిడీకి పాల్పడుతున్న వారి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిడితో జరుగుతున్న తవ్వకాలను అధికారులు అడ్డుకోవాలని కోరారు.

పదవిపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు


ప్రజాశక్తి - సామర్లకోట



వైసిపి నాయకులకు పదవులపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఉండటం లేదని జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ్ వాసు గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. గత 4సంవత్సరాల కాలంలో పట్టణంలో అభివృద్ధి పనులు ఏమి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎంఎల్ఎ చినరాజప్ప కృషితో పట్టణాన్ని అభివృద్ధి చేస్తుంటే వైసిపి కౌన్సిలర్లు అడ్డుకోవడం సరి కాదన్నారు. అనేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం పెడితే సమావేశాన్ని వైసిపి కౌన్సిలర్లు బహిష్కరించి అభివృద్ధిని అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. ఇంకా ఏడాది పదవి కోసం వారిలో వారే కీచులాడుకోవడం సిగ్గుకరంగా ఉందన్నారు.

న్యాయమూర్తి క్వార్టర్ ప్రారంభం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి క్వార్టర్‌ను జిల్లా జడ్జి గంధం సునీత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు ఆవరణలో జడ్జ్‌కి కోర్టు ఆవరణలోనే క్వార్టర్‌ను నిర్మించడం అభినందనీయమని అన్నారు. అనంతరం సబ్ జైలును తనిఖీ చేసి ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్జి కాటం భాను, న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి బి.మధుబాబు, కొల్లా వీర్రాజు, బుగత శివ, చెలంకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్, ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



దేవస్థానం భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

మండలంలోని సర్పవరంలో ఉన్న భావనారాయణ స్వామి దేవస్థానాన్ని గురువారం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎంఎల్ఎ పంతం నానాజీ దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సర్పవరం ఎపిఐఐసి భూములను అనుకుని ఉన్న దేవస్థానం భూములను సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్.కూమారి, దేవస్థానం ఇఒ ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చెత్త సమస్యపై ఎల్‌జికి వినతి

ప్రజాశక్తి - యానాం

డంపింగ్ యార్డ్, చెత్త సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్‌కు వినతిపత్రం పంపించినట్లు యానాం పర్యావరణ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరినట్లు చెప్పారు. యానాం వీధుల్లో చెత్త భారీగా పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెలువడుతుందని, గత కొన్ని రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందలు పడుతురని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేనిచోట యార్డును ఏర్పాటు చేసేలా స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం కొనసాగుతుంది. గురవారం స్థానిక మంచినీటి చెరువు పరిసరాలను, బొటానికల్ గార్డెన్స్‌లోని చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వాలంటీర్లు తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేస్తున్న పరిశుభ్రతా కార్యక్రమాలను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యానాం రీజినల్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ వాసశెట్టి ఆనంద్, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి దాతల కృషి అవసరం

ప్రజాశక్తి - పెదపూడి

విద్యారంగ అభివృద్ధికి దాతల కృషి ఎంతో అవసరమని ఎంఇఒ-2 సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని కైకవోలు గ్రామానికి చెందిన దాతలు కాకర రామచంద్రచౌదరి, దాట్ల వెంకటసూర్యకిరణ్ ప్రాథమిక పాఠశాలకు రూ.60 వేలు విలువ చేసే రెండు టీవీ యూనిట్లను బహుకరించారు. ఆ టీవీలను సర్పంచ్ నూనె పట్టాభి రామన్నచౌదరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం రాజీవ్ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాల 6, 7 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ పాఠ్యాంశానికి సంబంధించి సరళ విద్యుత్తు వలయాన్ని తయారు చేయుట, విద్యుత్తు ప్రవాహం వల్ల కలిగే ఉష్ణ ఫలితం, అయస్కాంత ఫలితం తదితర అంశాలపై విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. ఈ సందర్భంగా జంతు ప్రేమికుడు నవీన్ నాని పాములు గురించి వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని జి.మేడపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, జెసి రాహుల్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభ తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యంను విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్లు మోకా ఆనందసాగర్, కడలి ఈశ్వరి, తుమ్మల పద్మజ, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్, జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎం.దేవ్‌నాయక్, డివిజన్ వ్యవసాయ అధికారి రత్నప్రశాంతి, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య, సర్పంచ్ పటాని దేవి, తదితరులు పాల్గొన్నారు.